క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ వి.సింధురెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలలో జరుగుతున్న వాటర్‌డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు వి.ఆదర్శ్ రెడ్డి, డీఈ దేవేందర్, ఏఈ ఫైజన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ప్రయోజనం



చెక్కులు అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: సీఎం సహాయనిధి ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన సుజాత, మంజుల, నవీన్, చిట్కుల్‌కు చెందిన మన్నే వెంకటేశ్, బొల్లారం మున్సిపాలిటీకి చెందిన రెడ్డి లక్ష్మణ్ రావు, గుమ్మడిదల మున్సిపాలిటీ చెందిన రాజమ్మలకు మొత్తం రూ. మూడు లక్షల 25 వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, బొల్లారం మాజీ కౌన్సిలర్ సుజాత, దానయ్య, ముత్తంగి అశోక్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు తనిఖీ



గురుకుల పాఠశాల తనిఖీ చేస్తున్న శారద

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లిలో ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ సంగ్రామ్ తనిఖీ చేశారు. అలాగే, ఎంపీడీఓలు శారద, రమేష్‌బాబు సిర్గాపూర్‌లో ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల, కల్హేర్ మండలం బీబీపేట్ పాఠశాల వేర్వేరుగా తనిఖీ చేశారు. భోజన వసతి, బోధన అంశాలు పరిశీలించారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సుల్తానా

కల్హేర్(నారాయణఖేడ్): స్వస్థ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమంపై కల్హేర్‌లో బుధవారం అవగాహన కల్పించారు. స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ఉమారాణి మాట్లాడుతూ.. అధిక రక్తపోటు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత, మధుమేహంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, సాధారణ మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ బాబు, డాక్టర్ జేబ సుల్తానా పాల్గొన్నారు.

సింగూరుకు పోటెత్తిన వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు రెండు రోజులుగా వరద పోటెత్తడంతో ఆరు క్రస్టుగేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువభాగంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆనీరంతా డ్యాంలోకి చేరుతోంది. దీంతో అధికారులు ఆరుగేట్లను ఎత్తి 50751 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. డ్యాంలోకి 45809 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టులో 17.051 టీఎంసీల నీరు నిల్వ ఉంచి మిగతా నీటిని దిగువకు పంపుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు జిల్లా నుంచి సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థి వేదశ్రీ ఎంపికైనట్లు బుధవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. క్వాంటం యుగం ప్రారంభం -అవకాశం, సవాళ్లులో అనే అంశంపై జరిగిన సైన్స్ సెమినార్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయింది. రాష్ట్రస్థాయిలో ఈ నెల 18న ఎస్‌సీఈ ఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగే సెమినార్‌లో పాల్గొంటారన్నారు. విద్యార్థి, పాఠశాల యాజమాన్యానికి, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటేశం, అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

ఘనంగా ప్రజాపాలన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.



నారాయణఖేడ్: గౌరవవందనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కల్హేర్: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ శివ శ్రీనివాస్



సదాశివపేట పట్టణం రూరల్ బ్యాంకు కార్యాలయం వద్ద..



రామచంద్రాపురం: జీహెచ్ఎంసీ ఆఫీసులో..



సంగారెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో..



పటాన్‌చెరు టౌన్ : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్

కొనుగోళ్లపై ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలో పత్తి పంట కొనుగోలు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం పత్తి కొనుగోలుపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 3,48,775 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేశారని తెలిపారు. 2,79,020 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు. అంచనాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలుపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్ముకునేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, వివిధ శాఖల అధికారులు రషీద్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

జిల్లాలోని నిమ్జ్‌తోపాటు ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. భూసేకరణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని తేర్పోల్‌లో బీజేపీ నాయకులు బుధవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ బిల్లు లాంటి సహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న మోదీ నిండు నూరేళ్ళు ఆరోగ్యాంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అమ్రాది ఎల్లయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన




రోడ్డుపై వరినాట్లు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలోని బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదంటూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేశ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, మాజీ కోఆప్షన్ సభ్యులు లయక్, గోపాల్, మనూరు మండల పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు, నర్సింహులు యాదవ్, మశ్చేందర్ నిరసనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపాలిటీ పరిధిలో రూపాయి పని కూడా చేయలేదని ఆరోపించారు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని వాపోయారు. గుంతల్లో నీరు నిలిచిన చోట్ల వరి నాట్లు వేశారు.

నిలిచిపోయిన రాకపోకలు

జహీరాబాద్ టౌన్: భారీ వర్షానికి రంజోల్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరడంతో బుధవారం బాబానగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు నానాఅవస్థలు పడ్డారు. రంజోల్ నుంచి బాబానగర్‌కు వెళ్లే దారిలో రైలు పట్టాలు ఉన్నాయి. రాకపోకలకు కష్టమవుతుందని రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించారు. అండర్ బ్రిడ్జిలోకి చేరిన వర్షపు నీరు వెళ్లడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తిప్పలు తప్పడం లేదని బాబానగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు నిలిచిపోయిన ప్రతిసారి బాబానగర్, హుగ్గెల్లి తండా, పిచరాగడి తండా ప్రజలు 9 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అండర్ బ్రిడ్జిలోకి చేరిన వర్షం నీరు

సంక్షిప్త వార్తలు

◆ రాష్ట్ర కరాటే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా శంకర్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): జపాన్ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర కరాటే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా సదాశివపేట పట్టణానికి చెందిన కనిగరి శంకర్‌గౌడ్‌ను నియమించారు. బుధవారం పూర్వ విద్యార్థుల మిత్ర బృందం శంకర్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. 1987లో కరాటే శిక్షణ ప్రారంభించి క్రమక్రమంగా ఎదుగుతూ ఎంతో మంది విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తూ నేషనల్ కరాటే పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దారు. శంకర్‌గౌడ్‌ను మిత్రబృందం అభినందించారు. సన్మానించారు.

◆ ఎల్లంకిలో జాబ్ ఫెయిర్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ సదాశివరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26న ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ జాబ్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ.. కళాశాలకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ అప్రెంటిస్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా జాబ్ ఫెయిర్ నిర్వహించే అవకాశం కలిగిందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన డిగ్రీ పట్టభద్రులందరూ ఈ జాబ్ ఫెయిర్‌కు హాజరు కావచ్చు అని తెలిపారు.

◆ నష్టపరిహారం చెల్లించాలి

సదాశివపేట(సంగారెడ్డి): భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.30 వేలు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని బీకేఎంయూ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు ఎం, గంగమ్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీకెఎంయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..నెల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి, పెసర, మినుము, వరి, కూరగాయ ల పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో వినోద, మల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

◆ ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పద్మశాలి భవనంలో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పథకాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

9 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ఇద్దరికిరూ.1500, ఒకరికి రూ.500 చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం రాంరెడ్డిపేట్‌లో బుధవారం రేషన్ కార్డులు పంపిణీ చేశారు. రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులకు పంచాయతీ సెక్రటరీ విఠల్, మాజీ ఎంపీటీసీ మన్నే కృష్ణ బియ్యం అందజేశారు.

ప్రతిపాదనలు పంపించండి

సంగారెడ్డి జోన్: విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన మానయ్య, వెంకటేశం కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు లోకయుక్త బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 9న సాక్షి దినపత్రికలో విద్యుత్‌ఘాతంలో తండ్రీ కొడుకులు మృతి అనే శీర్షికను సుమోటోగా తీసుకొని నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

రిటైర్డు ఉద్యోగ సంఘం కార్యవర్గం

పుల్‌కల్(అందోల్): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం పుల్‌కల్ మండల శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంజయ్య, ప్రధానకార్యదర్శిగా రాంరెడ్డి, కోశాధికారిగా నర్సింహులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, మహిళా ఉపాధ్యక్షు రాలిగా రత్నాబాయి. జాయింట్ సెక్రటరీగా అంజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మొగల్‌రెడ్డి, ప్రచారకార్యదర్శిగా కుమారస్వామిని ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు తెచ్చిన తంటా

- రెండు నెలలుగా పంచాయతీ భవనంలోనే మహిళ
- కూల్చిన రేకుల షెడ్డు స్థలం తమదంటూ అడ్డుకుంటున్న గ్రామస్తుడు



పంచాయతీ భవనంలో నివాసముంటున్న శ్రీశైల

నారాయణఖేడ్: మంజూరయిన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనేందుకు ఉన్న రేకుల షెడ్డును కూలగొట్టిన మహిళకు ఆ స్థలం తమదంటూ ఓ వ్యక్తి అడ్డు పడుతుండటంతో ఆమె రెండు నెలలుగా పంచాయతీ భవనంలో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. బాధిత మహిళ, గ్రామస్తులు కథనం ప్రకారం.. ఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గంపల శ్రీశైల(52), 19 ఏళ్ల కిందట సయ్యద్ హకీంసాబ్‌కు సంబంధించిన సర్వే నంబర్ 90లోని 162 గజాల స్థలాన్ని కొని యజమాని, గ్రామపెద్దల సమక్షంలో బాండు పేపర్‌పై సరిహద్దులతో సహా రాసుకుని సంతకాలు చేయించుకున్నారు. ఆమె భర్త, కూతురు, కుమారుడు మృతిచెందారు. ఆ స్థలంలో19 ఏళ్లుగా రేకుల షెడ్డును నిర్మించుకొని ఆమె ఒంటరిగా జీవిస్తోంది. సదరు మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఇల్లు నిర్మించుకునేందుకు నెల కిందట షెడ్డును తొలగించుకుని స్థలాన్ని చదును చేయించి నిర్మాణం కోసం మార్కింగ్ వేయిస్తుండగా సయ్యద్ హకీంసాబ్ మనవడు సయ్యద్ మజీద్ అలీ పట్టా తన పేరిట ఉందని, శ్రీశైలకు ఇక్కడ ఇంటి నిర్మాణానికి అనుమతించొద్దని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఉన్న రేకుల షెడ్డు తొలగించుకుని స్థల వివాదంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించుకోలేక ఆమె ఖాళీగా ఉన్న పాత పంచాయతీ భవనంలో నివసిస్తోంది. సాదాబైనామాగా ఉన్న బాండు పేపర్ సైతం ఓనర్షిప్ పనిచేస్తుందనే నిబంధన ఉన్నందున ఇంటి నిర్మాణానికి అధికారులు అనుమతించాలని బాధితురాలు కోరుతుంది.

వినూత్న విధానంలో విద్యాబోధన



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, శంకర్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల పరిధి చాల్కి ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయుడు శంకర్ తన సొంత డబ్బులను వెచ్చించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాడు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పుస్తకాలను ప్రింట్ చేయించి విద్యార్థులకు పంపిణీ చేసి వినూత్న బోధనకు శ్రీకారం చుట్టాడు. బుధవారం ఎంఈఓ మారుతి రాథోడ్ చేతుల మీదుగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశాడు. బోధనోపకరణాలు ఉపయోగించి విద్యాబోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయుడు శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇతర ఉపాధ్యాయులు శంకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడి కృషికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న కవితాదేవి

జహీరాబాద్ టౌన్: సమాజ సేవలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో మండలంలోని అల్గోల్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శీతాకాలం శిబిరం బుధవారం ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మంచి సమాజం నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు గ్రామంలో ఉంటూ శ్రమదానంతో పాటు ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జహీరాబాద్ టౌన్ సీఐ.శివలింగం మాట్లాడుతూ.. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, కళాశాల డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరాంరెడ్డి, ప్రొగ్రాం ఆఫీసర్ నందుగౌడ్, దత్తు ,పాఠశాల హెచ్‌ఎం. ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఊర్లకు వెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి!

- అమీన్‌పూర్ సీఐ నరేష్
- ప్రచారం ప్రారంభించిన సీఐ



ఆటో ద్వారా ప్రచారం ప్రారంభించిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: దసరా సెలవులు వస్తున్న నేపథ్యంలో.. ఊర్లు, విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని అమీన్‌పూర్ సీఐ నరేష్ అన్నారు. బుధవారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ముందస్తుగానే పోలీసులు ఆటోతో ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దసరా సెలవులకు ఊర్లకు వెళ్లేవారు సమీప పోలీస్‌స్టేషన్‌లో వివరాలు ఇవ్వాలని.. అప్పుడే మీ ఇంటికి భద్రత కల్పించే వీలుంటుందన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగలు, నగదు వెంట తీసుకెళ్లడమే మంచిదని పోలీసులు చెబుతున్నారు.

విలువైన వస్తువులు ఇంట్లో ఉంచొద్దు

ఊర్లకు వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులను పెట్టొద్దు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నగలు, నగదును లాకర్‌లో భద్రపర్చుకోవాలి. పెద్ద మొత్తం నగదుతో కార్లలో వెళ్లేవారు డ్రైవర్ల గురించి ముందే తెలుసుకోవాలి. కొత్తవారిని నమ్మి ప్రయాణం చేయొద్దు. కాలనీ, ఇండ్లు, అపార్ట్‌మెంట్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



దసరా పండుగ వేళ పండుగ షాపింగ్‌ల పేరుతో వచ్చే లింక్‌లను ఎట్టి పరిస్థితిలో క్లిక్ చేయొద్దని బుధవారం ఒక ప్రకటనలో డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే ముందు సరైన సైట్‌లో చేస్తున్నారా లేదా చూసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

– డీఎస్పీ ప్రభాకర్, పటాన్‌చెరు